క్లుప్తంగా

బాధితులకు పరిహారం అందజేత



తాడిపల్లిలో బాధితులకు చెక్కులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాడిపల్లి గ్రామంలో 2023 డిసెంబరులో వచ్చిన మిచాంగ్ తుపాను కారణంగా దెబ్బ తిన్న ఇళ్లకు పరిహారాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ చేతుల మీదుగా అందజేశారు. కొప్పిశెట్టి కాంతంకు రూ.10 వేలు, పులి కృష్ణమోహన్‌కు రూ 3,200, పిల్లి వెంకటరెడ్డికి రూ.3,200 చెక్కులను సూర్యప్రకాశ్ బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీటీసీ రెడ్నం సతీష్, పీఏసీఎస్ చైర్మన్ పిల్లి బాలసుబ్రహ్మణ్యం, వీఆర్‌ఓ ఎస్.శ్రావణి, బాధితులకు పాల్గొన్నారు.

నేడు మండపేట మండల సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మండపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ తెలిపారు. సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులంతా సకాలంలో హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 33–11కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా సోమవారం రామచంద్రపురం మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చోడవరం సబ్ స్టేషన్ 11కేవీ రామలింగేశ్వర ఫీడర్ లైన్‌లో చోడవరం, నరసాపురపుపేట, ఓదూరు, యనమదల వాటర్ ట్యాంకు, చేపల చెరువులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నేడు ఐదో వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం

రామచంద్రపురం: పట్టణంలోని 5వ వార్డులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ నిర్వహించనున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ ,వైస్ చైర్పర్సన్లు, వార్డు కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆపార్టీ నియోజకవర్గ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

8న మండల సమావేశం

కపిలేశ్వరపురం: మండల పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం ఈనెల 8న స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నాను. సంబంధిత అధికారులు తమ పరిధిలోని అంశాలపై పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీఓ ఆదేశించారు.

తహసీల్దార్‌కు సన్మానం



శర్మను సన్మానించిన వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది

కె.గంగవరం: బదిలీపై అమలాపురం వెళుతున్న తహసీల్దార్ వైద్యనాథ్ శర్మను వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలురువు వీఆర్వోలు మాట్లాడుతూ వైద్యనాథ్‌శర్మ విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించారన్నారు. భూ సమస్యలతో పాటు రెవెన్యూ సంబంధించి సమస్యల పరిష్కారంలో తహసీల్దార్ సేవలు ఇతర సిబ్బందికి ఆదర్శనీయమన్నారు. అనంతరం శాలువాలు, పూలదండలతో తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

బీజేపీ పాలనలో ఆంధ్రాకు అన్యాయం

కపిలేశ్వరపురం (మండపేట): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని డీసీసీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ విభజన హామీలు అమలుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సి ఉందన్నారు. బీజేపీతో పొత్తులో ఉన్న పవన్ కల్యాణ్ హోదాపై ఒత్తిడి చేయడంలో విఫలమయ్యారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు, ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హోదా విషయంలో సరైన వైఖరిని కలిగిలేరన్నారు.

ఏడిదలో ఎమ్మెల్యే వేగుళ్ల పర్యటన

కపిలేశ్వరపురం (మండపేట): ఏడిదలో ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు 'బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ విధానాలను వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేందుకు టీడీపీ కృషి చేస్తుందన్నారు.

ఇంటి ముంగిటకు రేషన్

- పేదల వద్దకే నిత్యావసరాలు
- సేవ, ఉపాధి మిళితమైన కార్యాచరణ
- మూడు నియోజకవర్గాల్లో 119 వాహనాలు
- ఇంటింటికీ రేషన్ పథకానికి మూడేళ్లు

మూడేళ్ల క్రితం రేషన్ సరకులు తీసుకోవాలంటే ఓ పూట పని మానేయాల్సి వచ్చేది. రేషన్ షాపు వద్ద పడిగాపులు పడాల్సి ఉండేది. లేదంటే రేషన్ మానుకోవాల్సి వచ్చేది. వృద్ధులు, దివ్యాంగులు నడవలేక ఇబ్బంది పడేవారు. వీటికి చెక్ పెడుతూ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పథకం అమలు చేసింది. ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసింది. దీంతో ఇంటి ముంగిటకు వాహనం వచ్చి రేషన్ అందిస్తోంది. పేదల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కపిలేశ్వరపురం: ప్రభుత్వ పథకాలంటే పేదలకు ఆసరాగా నిలవాలి. అడపా తడపా అమలు కాకుండా అర్హులందరికీ అందాలి. పేరుకే కొద్ది నెలలు అమలు కాకుండా అధికారకాలమంతా ప్రజలకు అందించాలి. ఆర్థిక ఇబ్బందులు పేరుతో పథకాన్ని మరుగునపర్చకుండా ఇబ్బందులెదురైనా వాటిని అధిరోహించి అమలు చేసి చూపించాలి. ఇదే జరిగింది ఆంధ్ర ప్రదేశ్‌లోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు పేరుతో రూపొందించిన పథకాలను నాలుగున్నరేళ్ళుగా విజయవంతంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. అందులో ఒకటి ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ పథకానికి మూడేళ్ల నిండిన సందర్భంగా ఈ కథనం..



రామచంద్రపురంలో రేషన్ ఇస్తున్న ఎండీయూ ఆపరేటర్

పథకం నేపథ్యమిదీ..

రాష్ట్రంలో 2021 జనవరి 21 న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. వాహనాలన్నీ క్షేత్ర స్థాయికి చేరుకోగానే ఫిబ్రవరి ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 12 పట్టణాల్లో ప్రారంభమైంది. పంచాయతీ ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యంగా 23న గ్రామాల్లో ప్రారంభమైంది. మూడేళ్ళుగా పేదలకు సరకులు పంపిణీ దిగ్విజయంగా కొనసాగుతోంది.

మండలం	షాపులు	వాహనాలు	కార్డులు
మండపేట	64	34	43,029
రాయవరం	41	13	21,059
కపిలేశ్వరపురం	42	18	21,806
రామచంద్రపురం	58	24	34,420
కె.గంగవరం	43	15	20,602
కాజులూరు	45	15	22,821
మొత్తం	293	119	1,63,737

ప్రయోజనం ఇలా...

మండపేట నియోజకవర్గంలో 147 షాపుల పరిధిలో 65 వాహనాల ద్వారా 85,894 కుటుంబాలకు సరకులను పంపిణీ చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 146 షాపుల పరిధిలో 54 వాహనాల ద్వారా 77,843 కుటుంబాలకు అందిస్తున్నారు.

పర్యవేక్షణ ఇలా..

ఇంటింటికీ సరకులు ప్రతి నెలా అందించడం ప్రభుత్వ శాఖల సమన్వయం, అధికారుల చొరవ అత్యవసరం. ప్రభుత్వం చిత్తశుద్ధితో క్షేత్ర స్థాయి యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ విజయవంతంగా సరకులను పంపిణీ చేస్తోంది. పై స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆదేశాలపై జాయింట్ కలెక్టర్ పథకం నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లోని ఎండీయూ ఆపరేటర్లు ఒకటో తేదీ నుంచి సరకులను పంపణీ చేస్తున్నారు. 1 నుంచి 17వ తేదీ వరకూ సరకులు సరఫరా చేస్తున్నారు. తూకాల్లో మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటా ద్వారా లబ్ధిదారుని ఎదురుగా తూకమేయడం ద్వారా పారదర్శకతకు పెద్ద పీట వేసింది. ఈ పథకం ద్వారా లబ్ధిఆదారులకు దూరాభారం, నిరీక్షణలకు స్వస్తి పలికింది.

> **ఉపాధి పొందుతున్నా**
>
> 
>
> ఎండీయూ ఆపరేటర్‌గా ఉపాధి పొందుతున్నాను. యంత్రం, ఇంటర్నెట్ సామర్థ్యాలు పెంచడంతో పంపణీలో సాంకేతిక సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇంటికి వెళ్లి సరకులు ఇస్తుండడం వల్ల వర్షమూ, ఎండ తీవ్రతల సమస్యలేదు.
>
> – చిల్లర అంజనేయులు, ఎండీయూ ఆపరేటర్, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం మండలం

పథకాలతో పేదలకు మేలు



హసన్‌బాదలో మహిళలకు పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

- పిల్లి సూర్యప్రకాశ్
- హసన్‌బాదలో 'గడప గడపకూ'

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవ రత్నాల పథకాలతో పేదలకు జరిగిన మేలును వివరించారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని తక్షణం పరిష్కరించేలా కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మహిళలు హారతులు ఇస్తూ, చిన్నారులు పూలు జల్లుతూ సూర్యప్రకాశ్‌కు అడుగడుగునా నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యెన్నం దేవి, ఉప సర్పంచ్ నీలం భవాని, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ భాస్కరలక్ష్మి, వీఆర్‌ఓ సూర్యకుమారి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణే మేలైన విధానం



మేడిశెట్టి కృష్ణార్జున, మండల పశువిద్యాధికారి



గేదెలు

రామచంద్రపురం రూరల్: మేలు జాతి పశు సంపద కోసం కృత్రిమ గర్భధారణ మేలైన విధానమని రామచంద్రపురం మండల పశువైద్యాధికారి డా.మేడిశెట్టి కృష్ణార్జున తెలిపారు. మేలు జాతి పశువుల కోసం కృత్రిమ గర్భధారణ విషయాలను ఆయన 'సాక్షి'కి వివరించారు.

అధిక పాల దిగుబడులు ఇచ్చే పశువుల జాతికి చెందిన ఆబోతుల వీర్యాన్ని ముందుగా సేకరించి భద్రపరుస్తారు. ఎదకు వచ్చిన ఆడ పశువుల గర్భంలోని కృత్రిమ పద్ధతుల్లో ఆ వీర్యాన్ని ప్రవేశపెట్టి మేలు జాతి దూడలను పుట్టించడమే కృత్రిమ గర్భధారణ అని వివరించారు. విదేశీ ఆవు జాతికి చెందిన జెర్సీ హోల్‌స్టెయిన్ (హెచ్‌ఎఫ్), స్వదేశీ జాతికి చెందిన గిర్, సాహిపాల్, తార్‌పార్‌కర్, గేదె జాతికి చెందిన ముర్రా, మెహసాన, జిప్సర్ బాది రకాల వీర్యం ద్వారా సంతానోత్పత్తి చేస్తున్నారు.


లక్షణాలు

విదేశీ పశువుల వీర్యంతో పుట్టిన దూడలు అధిక పాల దిగుబడి సామర్థ్యం కలిగి ఉంటాయి. కాని రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండదు. వాటి జీవిత కాలం కూడా తక్కువగా ఉంటుంది. అదే స్వదేశీ జాతి పశువు వీర్యం వల్ల పుట్టిన దూడలు విదేశీ జాతుల కన్నా తక్కువగా పాల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటాయి. అయితే రోగ నిరోధక శక్తి మాత్రం ఎక్కువగా ఉండి జీవిత కాలం కూడా ఎక్కువగానే ఉంటుంది. అంతే కాకుండా స్వదేశీ జాతుల పశువుల పాలు, పేడ, మూత్రం కూడా అధిక పోషకాలు కలిగి ఉంటాయి. ఆయుర్వేద గుణాలు కలిగి ఉంటాయని భారతీయుల నమ్మకం. సంప్రదాయ పద్ధతుల ప్రకారం స్వదేశీ పశుజాతుల అభివృద్ధి మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగానే చర్యలు చేపడుతుంది.

వీర్యధారణ సమయం

సాధారణంగా ఆవులు ఒకటిన్నర సంవత్సరాలు నుంచి 3 సంవత్సరాల లోపు, గేదెలు అయితే 3 నుంచి 5 సంవత్సరాల లోపు ఎదకు వస్తాయి. ఇలా చూలు నిలిచే వరకు ప్రతి 18 నుంచి 21 రోజులకు ఎదకు వస్తూనే ఉంటాయి. ఈ ఎద సమయాన్ని గుర్తించి ఆ సమయంలో కృత్రిమ వీర్యధారణ చేయించాలి. ఎదకు వచ్చిన పశువు బిత్తర చూపులు చూస్తుంది. మతి స్థిమితంగా ఉండదు. మూత్రం కొద్దికొద్దిగా ఎక్కువ సార్లు పోస్తుంది. మానం నుంచి తీగ వస్తుంటుంది. మానం కూడా ఉబ్బి ఉంటుంది. పాడి పశువు అయితే పాలు తగ్గి పోతాయి. ఇతర పశువుల మీదకు ఎగబాకడం చేస్తాయి. ఈ ఎదకాలం 24 గంటల వరకు ఉంటుంది. ఎదకు వచ్చిన 12 నుంచి 18 గంటల్లోపే కృత్రిమ గర్భధారణ ప్రక్రియ నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుంది.

జాతీయ స్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో టోనీ పున్నయ్య తదితరులు

మలికిపురం: జాతీయ స్థాయిలో ఈ రోజు జరిగిన నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో లక్కవరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జపాన్‌కు చెందిన డో హయాసా, హా షితో, రియూ కాయ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఈ గ్రామానికి చెందిన ఎస్.అభిజ్ఞాన్సన్, ఎ.అవినాష్, ఎస్.సుభాషిణి, ఎ.మోహన్ దీప్తి, జి.ప్రజ్ఞానస్ విద్యార్థులకు బెస్ట్ ప్రదర్శన గాను ఏల్లో బెల్ట్, ప్రశంసా పత్రాలను ఆ సంస్థ చీఫ్ టోనీ పున్నయ్య లక్కవరంలో అందజేశారు. ప్రిన్సిపాల్ కళ, బాలాజీ పాల్గొన్నారు.

సూర్యదేవునికి పూజలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అరటి పంటపై పందుల దాడి

అంబాజీపేట: లక్షలు వెచ్చించి నాటిన అరటి పంటను పందులు స్వైరవిహారం చేసి నాశనం చేశాయి. అంబాజీపేట, మాచవరం గ్రామాల్లో పందులు విచ్చలవిడిగా సంచరించి నష్టాల పాలు చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సేవేటి వెంకట్రావుకు చెందిన నాలుగెకరాలలో అరటి తోటను రూ.లక్షతో నాటారు. అరటి దుంపలతో సహా పందులు పెకిలించి నష్టపరిచాయని వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే ఈ రెండు గ్రామాల్లో చేతికందొచ్చిన అరటి పంటను నాశనం చేయడంతో రూ.లక్షలు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

కోల సంబరాన్ని కళగా గుర్తించాలి

కళాకారుల సంఘం
నూతన కమిటీ డిమాండ్



కోల సంబరం కళాకారుల సంఘ నూతన కమిటీని అభినందిస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: ప్రసిద్ధి చెందిన కోల సంబరాన్ని ప్రభుత్వం కళగా గుర్తించాలని శ్రీ వెంకటేశ్వర దుర్గాదేవి కోల సంబరం కళాకారుల సంఘం డిమాండ్ చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది కోల సంబరం కళాకారులు రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ కోల సంబరాన్ని ప్రభుత్వం కళగా గుర్తించాలని, ఆ కళాకారులకు ఇతర కళాకారుల్లా ప్రభుత్వ ప్రయోజనాలు వర్తింపజేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 50 ఏళ్లు దాటినవారి పింఛను మంజూరు చేయాలని కోరారు. సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘం అధ్యక్షుడిగా ఈతా దుర్గారావు, ఉపాధ్యక్షుడిగా వాసంశెట్టి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా మైగాపుల శ్రీను, సహాయ కార్యదర్శిగా కానుబోయిన పెద్దిరాజు, కోశాధికారిగా వనుం వీరవెంకటసత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అనంతరం కోల సంబరం వెల్లలో ప్రారంభించిన మూలపురుషుడు చిక్కాల కాటయ్య, కళను వ్యాప్తి చేసిన చిక్కాల కామయ్య, చిక్కాల జానకిరామయ్య, చిక్కాల పట్టాభిరామయ్యలను స్మరించుకుంటూ వారి వారసులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, కోట శ్రీనివాసరావు, చిక్కాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై శ్రద్ధ అవసరం



గొల్లపాలెంలో అవగాహన కల్పిస్తున్న క్రాంతికుమార్

కాజులూరు: దంత సమస్యలపై ప్రజలు శ్రద్ధ వహించాలని ద్రాక్షరామ భీమేశ్వర దంత వైద్యశాల అధినేత డాక్టర్ క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లపాలెంలో నోటి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దంత సంరక్షపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, నోటిలో ఏర్పడే చిన్న, చిన్న సమస్యలను అశ్రద్ధ చేయడంతో నోటి క్యాన్సర్‌కు దారితీసే అవకాశాలు ఉన్నాయన్నారు. దూమపానం, గుట్కా, పాన్ తంబాకు తదితర వాటికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలువురికి దంత సమస్యలపై చికిత్సనందించారు. కార్యక్రమంలో డాక్టర్ చందూ, శేషకుమారి తదితరులు పాల్గొన్నారు.

పొల్లమ్మ ఆలయ కరపత్రాల ఆవిష్కరణ



ఈదరాడలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రథసారథి శ్రీరామ్మూర్తి

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పొల్లమ్మ ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం పునః నిర్మాణ సారథి యెరుబండి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని శ్రీరామ్మూర్తి తెలిపారు. 20వ తేదీ మంగళవారం ఉదయం 10.34 గంటలకు పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 21వ తేదీ అమ్మవారి ఊరేగింపు, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 22వ తేదీ గురువారం ఉదయం 11.53 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని చెప్పారు. 23వ తేదీ సామూహిక కుంకుమార్చన ఏర్పాటు చేశామన్నారు. కరపత్రాల ఆవిష్కరణ అనంతరం అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌కు కరపత్రాలను అందించారు. పునః ప్రతిష్ఠా మహోత్సవాలకు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పరిశీలన



ముంగండ సచివాలయంలో జగనన్న లేఅవుట్ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

పి.గన్నవరం: జగనన్న లేఅవుట్ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తపేట ఆర్డీఓ డీవీవీ సత్యనారాయణ ఆదేశించారు. ముంగండ గ్రామ సచివాలయంలో ఆదివారం జరిగిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, వీఆర్వోలు దొరబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరం గ్రామ సచివాలయంలో ఆదివారం జగనన్న లేఅవుట్ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. వీఆర్వో తోట శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కుంపట్ల పోలరాజు, సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అంబాజీపేట: మాచవరం పక్షులరావిచెట్టుకు చెందిన ఓ వివాహిత అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గుడివాడకు చెందిన గుత్తుల జోత్స్న సత్యశ్రీ (18) తన పుట్టింటికి సంక్రాంతి పండగకు వచ్చిందన్నారు. గత నెల 27వ తేదీ రాత్రి ఇంటిలో ఉరివేసుకోవడంతో స్థానికులు, బంధువులు స్పందించి అమలాపురం ఆస్పత్రికి తరలించారన్నారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడి నుంచి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తుండగా మృతి చెందిందన్నారు. మృతురాలి తల్లి మామిడిశెట్టి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన కమిషనర్



మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన కమిషనర్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కమిషనర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన బి.రాము మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణిను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని పరిస్థితులపై చర్చించారు. ప్రశాంత వాతావరణం ఉన్న మండపేటను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసే దిశగా కృషి చేయాలని కమిషనర్ రాముకు చైర్‌పర్సన్ దుర్గారాణి సూచించారు. పట్టణ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలను కమిషనర్ వివరించారు.

చిట్టిబాబుకు పరామర్శ



చిట్టిబాబును పరామర్శిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పట్టణంలోని 2వ వార్డు స్టిల్‌విల్‌పేటకు చెందిన వైఎస్‌ఆర్ సీపీ సీనియర్ నేత మందపల్లి చిట్టిబాబును రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం పరామర్శించారు. ఇటీవల చిట్టిబాబు అస్వస్థతకు గురై గుండెకు ఎంజియోగ్రాం చేయించుకున్నారు. ఈ మేరకు చిట్టిబాబు ఆరోగ్య పరిస్థితులను మంత్రి వేణు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నేతలు కుడిపూడి గణేష్, గుబ్బల ఏసురాజు తదితరులు ఉన్నారు.

మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు



మద్యం బాటిల్స్‌ను సీజ్ చేస్తున్న ఎస్సై జానీబాషా

కె.గంగవరం: శేరిలంకలో మద్యం అమ్మకాలు జరుపుతున్న పోతుల సత్యనారాయణ మూర్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై జానీ బాషా ఆదివారం తెలిపారు. అతని నుంచి 20కి పైగా మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా యానం నుంచి మద్యం తరలిస్తున్న వ్యక్తులపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

20 లీటర్ల సారా పట్టివేత



సారా సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై పరదేశి

కపిలేశ్వరపురం: వీధివారిలంకలో సారా బట్టీపై అంగర ఎస్సై అందే పరదేశి ఆదివారం తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. బట్టీ నిర్వాహకుడు పారిపోతుండగా పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. ఘటనా ప్రదేశంలో 20 లీటర్లు సారా, గ్యాస్ సిలెండర్, పాత్రలను స్వాధీనపర్చుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పరదేశి తెలిపారు. మండలంలోని లంక గ్రామాల్లో సారా బట్టీలు నిర్వహిస్తున్నట్టు సమాచారం ఉన్న నేపథ్యంలో చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎలుకల మందు వినియోగంపై అవగాహన

కాజులూరు: పంట పొలాల్లో ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న బ్రోమోడయెలిన్ మందును రైతులు సద్వినియేగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గ్రామాల్లో గత రెండు రోజులుగా వ్యవసాయాధికారులు ఆర్‌బీకేల వద్ద రైతులకు బ్రోమోడయెలిన్ మందును పంపిణీ చేస్తున్నారు. ఆదివారం గొల్లపాలెంలో జరిగిన కార్యక్రమాల్లో ఏట పాల్గొని మాట్లాడుతూ సామూహిక చర్యల ద్వారా రైతులు ఎలుకలను నిర్మూలించుకునేందుకు ప్రభుత్వం బ్రోమోడయెలిన్ మందును సరఫరా చేస్తోందన్నారు. రైతులు ఎకరానికి 200 గ్రాముల చొప్పున నూకలు తీసుకువచ్చిన వారికి స్వయంగా తమ సిబ్బందే మందు ఎరను తయారు చేసి ఇస్తారన్నారు.